క్లుప్తంగా

వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయం



డీఆర్‌డీఏ దఫేదారు జె.వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న పీడీ విజయరాజు, తదితరులు

ఏలూరు (టూటౌన్): డీఆర్‌డీఏలో దఫేదారుగా 39 సంవత్సరాలు పని చేసిన జాగర్లమూడి వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని పీడీ ఆర్.విజయరాజు అన్నారు. వెంకటేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా స్థానిక టీటీడీసిలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు దంపతులను సత్కరించారు. అనంతరం పీడీ విజయరాజు మాట్లాడుతూ అధికారులకు అందుబాటులో ఉంటూ సమయాన్ని క్రమశిక్షణతో పాటించి ఎంతో మంది అధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. వెంకటేశ్వరరావు సహా ఉద్యోగులు విధి నిర్వహణలో ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఇ.అనిత, డీఆర్డీ సిబ్బంది, డిపియంస్, ఎపిఎంఎస్, జిల్లా సమాఖ్య పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతీ ఆరోగ్యవంతుడూ రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ వై. బాను ప్రవీణ్ పిలుపునిచ్చారు. జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో స్థానిక యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో శుక్రవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసీ మెకానిజంలో తమ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ నిరుద్యోగులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. వారిలో కొంత మంది యువకులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇప్పటి వరకూ 101 సార్లు రక్తదానం చేసిన బావిశెట్టి చిరంజీవి రావు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడడమే కాకుండా రక్తదానం చేసిన వారు కూడా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. పురుషులు ప్రతీ మూడు నెలలకు ఒక సారి, మహిళలు ప్రతి నాలుగు నెలలకు ఒక సారి రక్తదానం చేయవచ్చని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న వారిలో 32 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీ ఎం. భూషణం, రెడ్‌క్రాస్ పీఆర్‌ఓ కేవీ రమణ, ఎస్. విజయ, సీహెచ్ శైలకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిరోధానికి అందరూ కృషి చేయాలి



పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో ప్లాస్టిక్ నిరోధకంపై కళాజాత

పెదవేగి : ప్లాస్టిక్ నిరోధానికి ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు అవసరమని కళాజాత కళాకారులు ఎం శేఖర్ బాబు అన్నారు. శుక్రవారం పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధంపై కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ వారి ఆదేశానుసారం జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణ, పారిశుద్ధ్యం, జగనన్న నవరత్నాలు తదితర కార్యక్రమాలపై ప్రజలలో అవగాహన కల్పించడం కోసం కళాజాత రూపంలో ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి, గ్రామస్తులకు శనివారం అవగాహన ప్రదర్శన నిర్వహించినట్టు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య కుమార్, ఎంపీడీవో జీ ఆర్ మనోజ్, కార్యదర్శి ప్రసాద్, మహిళా పోలీసు జ్యోతి పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్

- రూ.4.60 కోట్లతో కొత్త సబ్‌స్టేషన్
- ఇప్పటికే రూ 2.25 కోట్ల రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: కొల్లేరు గ్రామాల విద్యుత్ సమస్యలకు తెర పడింది. శుక్రవారం ఏలూరు మండలం గుడివాకలంకలో ప్రభుత్వం మంజూరు చేసిన సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ సభకు గుడివాకలంక, కొక్కిరాయిలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, మొండికోడు, పెదయాగనమిల్లి, కోమటిలంక, కోటేశ్వరదుర్గాపురం తదితర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా కొల్లేరు గ్రామాల ప్రజలను వేదిస్తున్న విద్యుత్ హెచ్చుతగ్గు సమస్యలు సబ్‌స్టేషన్ ఏర్పాటుతో పరిష్కారమవుతాయన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ 4.6 కోట్లు మంజూరు చేసిందన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి కాగానే కొల్లేరు గ్రామాల ప్రజలకు 24 గంటలు హెచ్చుతగ్గులు లేకుండా కరెంట్ సరఫరా అవుతుందన్నారు. మరోపక్క చేపల చెరువులకు సైతం అధికారులు నాణ్యమైన కరెంట్ సరఫరా చేస్తారని వివరించారు. సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు వైఎస్సార్ సీపీ నాయకుడు పీవీరావు, సర్పంచ్‌లు జయమంగళ ప్రభావతిరామారావు, ముంగర తిమోతీ, తోకల అమల, వేగ్శెగోపాలకృష్ణంరాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల కొండలరావు, ముంగర వెంకటేశ్వరరావు, బలే బలరామయ్య, రుక్మనంద మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.25 కోట్ల పనుల పూర్తి

కొల్లేరు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ 2.25 కోట్లు ఖర్చు చేసింది. ఇప్పటికే సుమారు రూ.1 కోటి 5 లక్షతో కొల్లేరు గ్రామాల గూండా కొత్త ఫీడర్లు, ట్రాన్స్‌పార్మర్లు, స్తంభాలు అధికారులు పాతారు. చాటపర్రు, సుంకరవారితోట సబ్‌స్టేషన్‌లో రూ.1.20 కోట్లు ఖర్చు చేసి రెండు భారీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. సుంకరవారితోట సబ్‌స్టేషన్ నుంచి మాదేపల్లి, శ్రీపర్రు, కలకుర్రు, మానూరు, మహేశ్వరపురం గ్రామాలకు, చాటపర్రు సబ్‌స్టేషన్ నుంచి కొల్లేరు గ్రామాలకు మరో రెండు కొత్త ఫీడర్లు ఏర్పాటు చేశారు. 7 కిలోమీటర్ల మేరకు పైగా స్తంభాలు పాతారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. పంటచేలు, చేపల చెరువులకు ఒక ఫీడర్, గృహాలకు మరో ఫీడర్ల ద్వారా కరెంట్ సరఫరా చేపట్టారు. వీటితో పాటు పైడిచింతపాడు వద్ద సుమారు కిలోమీటర్ దూరంలో చెరువులో వాలిపోయి ప్రమాదకరంగా మారిన స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాలు పాతారు.



గుడివాకలంకలో జరిగిన సభకు హాజరైన కొల్లేరు ప్రజలు

లో-ఓల్టేజీ సమస్య పరిష్కారం



ఎన్నో ఏళ్లగా ఉన్న లో-ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుంది. గృహ అవసరాలకు, వ్యవసాయం, చేపల సాగుకు వేరువేరుగా విద్యుత్ సరఫరా చేయనుండడం ఎంతో సంతోషంగా ఉంది. మా గ్రామ పరిసరాల్లో కొత్త స్తంభాలు పాతారు. రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు 24 గంటలు కరెంట్ సరఫరా అయితే సంతోషమే.

– ముంగర తిమోతీ, పైడిచింతపాడు

ఎమ్మెల్యే కృషి ఎంతో ఉంది



గతంలో వర్షాలు, వరదలు వస్తే ప్రజలు రోజుల తరబడి చీకట్లో బిక్కు బిక్కుమని బతికే వాళ్లం. గతంలో ఏ ప్రభుత్వం మా కష్టాలు చూడలేదు. కనీసం వినలేదు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టడం, మా కొల్లేరు ప్రజలు ఎంతో ఎన్నటికీ మరువలేరు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో అధికారులు వేగంగా పనులు చేపట్టడం సంతోషంగా ఉంది.

– ముంగర సంజీవ్‌కుమార్, పైడిచింతపాడు, కొల్లేరు

చరిత్రలో గుర్తుండి పోతుంది



ప్రభుత్వం కొల్లేరు గ్రామాలకు ప్రత్యేక్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి చరిత్రలో నిలిచిపోతుంది. ఆయన సేవలు కొల్లేరు ప్రజలు ఎన్నటికీ మరువలేరు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో నానా అగచాట్లు పడేవాళ్ళం. మా అవస్థలు గత ప్రభుత్వంలో ఎంతమందికి చెప్పుకున్నా తీర్చే నాధుడే కానరాలేదు.

– జయమంగళ రామారావు, గుడివాకలంక

వేగంగా జరుగుతున్నాయి



గతంలో కొల్లేరు పరిసరాల్లో విద్యుత్ స్తంభాలు వాలిపోవడం వల్ల విద్యుత్ షాక్‌కు గురై పశువులు ప్రాణాలు కోల్పోయేవి. కొన్నిసార్లు మనుషులు సైతం ప్రాణాలు కోల్పోయే వారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అలాంటి సమస్యలు కానరాలేదు. వాలిన పాత స్తంభాల స్థానంలో అధికారులు వెంటనే కొత్త స్తంభాలు వేస్తున్నారు. చాటపర్రు సబ్ స్టేషన్ నుంచి గుడివాకలంక, సుంకరవారితోట నుంచి శ్రీపర్రు మీదగా కొత్త ఫీడర్ ద్వారా కరెంట్ సరఫరా చేయడం సంతోషంగా ఉంది.

– తేరా ఆనంద్, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు

పటిష్టంగా జగనన్న సురక్ష



జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష నిర్వహిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని

ఏలూరు (టూటౌన్): క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్షా సమావేశాన్ని ఆళ్ల నాని అధ్యక్షతన శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ అర్హత కలిగి పలు కారణాల చేత పథకాలు అందకుండా మిగిలిపోతున్న లబ్ధిదారులను గుర్తించి వారికి లబ్ది చేకూర్చేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఏలూరు నియోజకవర్గ పరిధిలో క్యాంపులు ఏర్పాటు చేసిన చోట ప్రజలకు అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. క్యాంపు తేదీకి ముందు సర్వే నిర్వహించే సమయంలో స్థానికప్రజాప్రతినిధులను, కన్వీనర్లను, గృహసారథులను సమన్వయం చేసుకోవాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం అందజేయనున్న 11 రకాల ధ్రువపత్రాలను సంబంధిత క్యాంపు నిర్వహించే తేదీనే జారీ చేసేలా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలని, క్షేత్రస్థాయిలో అర్హత కలిగి ఉండి ఏదైనా సాంకేతిక కారణంతో అనర్హులైన వారిని గుర్తించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, అడిషనల్ కమీషనర్ బాపిరాజు, డిప్యూటీ కమిషనర్ రాధ, తహసీల్దార్ సోమశేఖర్, పీఓ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీకి అభినందనలు



ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావుకు మొక్కను అందజేస్తున్న లిడ్‌క్యాప్ డైరెక్టర్ సందీప్

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని యువత చెడు మార్గంలో వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు గంజాయి, మాదక ద్రవ్యాలకు బానిసలై తమ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారన్నారు. ఈ స్థితి నుంచి బయటకు రప్పించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అవగాహన సదస్సులను జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిర్వహించి విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించడాన్ని ఆయన అభినందించారు. గ్రామీణ ప్రాంత యువత మద్యానికి బానిసలై భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టివేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో చింతలపూడి నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాల్లో యువత, విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావును సందీప్ కోరారు.

కుట్టు మెషీన్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మూడేళ్లుగా చేసిన సేవాకార్యక్రమాల బాధ్యతలు శుక్రవారం పూర్తవుతున్న సందర్భంగా మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు దాకారపు కృష్ణ అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వర రావు రోటరీ కమ్యూనిటీ హాల్‌లో కార్యదర్శి వూడా రాంగోపాల్ (గోపీ) నిర్వహణలో నిర్వహించిన కార్యక్రమంలో రోటరీ నుంచి లిటిల్ ఏంజిల్స్ సంస్థ ప్రతినిధి తాంధ్ర పద్మజ ఆధ్వర్యంలో మెషీన్లను పంపిణీ చేశారు. అధ్యక్షుడు దాకారపు కృష్ణ తదితరులు యువదాత గొట్టుముక్కల వంశీరాజును అభినందించారు. బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రటరీ అవార్డులతో పాటు ప్రతిష్టాత్మక అవార్డులు ఇటీవల గవర్నర్ విశ్వనాథ భాస్కరరామ్ చేతులు మీదుగా అందుకున్న దాకారపు కృష్ణ, వూడా రాంగోపాల్‌ను సత్కరించారు. రాయపరాజు మిత్రులు 17వ వార్డ్ కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, మంతెన సత్యనారాయణరాజు, చార్టర్ సభ్యులు చామర్తి శ్రీరాములు, రోటరీ ప్రెసిడెంట్ ఎలెక్ట్ రొంగల దేవీ ప్రసాద్, సెక్రటరీ ఎలక్ట్ బవిరిశెట్టి హనుమాన్ తిలక్ తదితరులు పాల్గొన్నారు

వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలి

భీమడోలు: కిషోర బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని భీమడోలు ఐసీడీఎస్ పీవో కేవీ విజయలక్ష్మి అన్నా రు. గుండుగొలను-23 కేంద్రం వద్ద కార్యకర్త బి.రాజమణి ఆధ్వర్యంలో శుక్రవారం బేటీ పచావో బేటీ పడావో కార్యక్రమంపై కిషోర్ బాలికలు, మహిళలు, యువతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సూపర్‌వైజర్ కె.కవిత అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన పీవో కేవీ విజయలక్ష్మి మాట్లాడుతూ కిషోర్ బాలికలు అపరిచితులు, యువకులు చెడు స్పర్శ చేసినట్లయితే వెంటనే తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకుని వెళ్లాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లేశ్వరీ, మహిళా కానిస్టేబుల్ అరుణ, హెచ్‌వీ నవీన్, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రాజమణి, విజయ, పద్మ, అన్నమ్మ రమ, ఈశ్వరి, వేణు, పద్మావతి పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం

పెదపాడు: జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలో జూలై 1నుంచి నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. 1తేదీన కొక్కిరపాడు గ్రామంలోని వీఓ భవనంలో సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 4న సత్యవోలులో, 5న అప్పనవీడు, 6న నాయుడుగూడెం, 7న వట్లూరు, 10న సకల కొత్తపల్లి, 11న కొక్కిరపాడు, 12న వీరమ్మకుంట, 13న వట్లూరు, 14న పెదపాడు, 15న వట్లూరు, 17న కొత్తముప్పర్రు, 18న ఏపూరు, 19 పాతముప్పర్రు, 20 ఏపూరు, 21న తోటగూడెం, 22న అప్పనవీడులోను, 24న కొత్తూరు గ్రామం, 25 వసంతవాడ, 26 గుడిపాడు, 27 కలపర్రు, 28న పెదపాడు గ్రామ సచివాలయాల పరిధిలోని కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

భీమడోలు: భీమడోలు సూర్యాపేటలో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. బహిరంగ స్థలంలో పేకాట ఆడుతుండగా ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5,065 స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ తెలిపారు.

మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై కైకరం వద్ద మోటారుసైక్లిస్టు అదుపుతప్పి వాహనంతో లంకలోకి దూసుకుపోయాడు. శుక్రవారం మధ్యాహ్నం ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వైపు వెళుతుండగా ఈ ప్రమాదంలో జరిగింది. తాడేపల్లిగూడెంకు చెందిన టి. రఘుకు తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరిగింది. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స చేసి తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలో శ్రీ లక్ష్మీ టైల్స్ అండ్ శానిటరీ షాపులో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు జీజే విష్ణువర్ధన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బొండాడ శ్రీనుకు చెందిన టైల్స్ అండ్ శానిటరీ దుకాణంలోని రూ.2లక్షల నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తులో భాగంగా అచ్యుతాపురానికి చెందిన చావల రామాంజనేయులు నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. రామాంజనేయులు అరెస్టు చేసి నగదు స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

జెడ్పీ నిధులతో తాగునీటి బోర్లు

కొయ్యలగూడెం: గడపగడపకు మన ప్రభుత్వ నిర్వహణ ప్రతి ఫలాలు ఒక్కొక్కటిగా ప్రజలకు అందుతున్నాయి అని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి శ్రీ లక్ష్మీ పేర్కొన్నారు. శనివారం పరింపూడి పంచాయతీ పరిధిలో రూ.8 లక్షల జెడ్పీ నిధుల ద్వారా ఏర్పాటు చేసే తాగునీటి బోర్ల ప్రారంభ పూజలకు ప్రజా ప్రతినిధులతో కలిసి ఆమె పాల్గొన్నారు. సర్పంచ్ ముప్పిడి విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్టీ ఏరియాలో ఒకటి, పాత పరింపుడిలో ఒకటి చొప్పున చేరో రూ.4 లక్షలతో నిర్మాణం చేపట్టారు. ఎంపీపీ గంజి మాల రామారావు, వైస్ ఎంపీపీ మట్ట వనజ లక్ష్మి, గొడ్లటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఇంటింటా సర్వే

దెందులూరు: కొవ్వలిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విద్యార్థుల ప్రవేశం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు హాస్టల్ వార్డెన్లు గ్రామాల బాట పట్టారు. దోసపాడులో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను, విద్యార్థులను కలిశారు. హాస్టల్‌లో సౌకర్యాలను వివరించి పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వార్డెన్లు గోల్డెన్ రాజు, కర్ణుడు కోరారు.

టోల్‌ప్లాజా వద్ద కంటి వైద్య శిబిరం

ఉంగుటూరు: జాతీయ రహదార్ల అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద ఉచిత నేత్ర వైద్యశిబిరం శుక్రవారంనిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రాజెక్టు మేనేజరు బాలసుబ్రహ్మణ్యం ప్రారంభించారు. హైవే సిబ్బందికి, వాహనదార్లకు 130 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. టీబీఆర్ ఏజీఎం రాజేష్, ఎన్‌హెచ్ అధికారి ఫణి పాల్గొన్నారు. ఏలూరు శంకర్ నేత్ర వైద్యాలయం డా. ఎండీ తస్లిమా రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. ఐఎంటీ మేనేజరు జగదీష్, ప్లాసా మేనేజరు ఎ.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పాత బస్టాండ్ నుంచే హైదరాబాద్ బస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి బయలుదేరే దూరప్రాంత బస్సులైన హైదరాబాద్ బస్సులు క నుంచి పాత బస్టాండ్ వద్ద నుంచి బయలుదేరతాయని ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకూ హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ఏలూరు కొత్త బస్టాండ్ నుంచే బయలుదేరేవని, అయితే నగరంలోని వన్‌టౌన్ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు కొత్త బస్టాండ్‌కు వచ్చి ఈ బస్సులు ఎక్కాల్సి వచ్చేదన్నారు. అయితే ప్రయాణికుల కోరిక మేరకు హైదరాబాద్ వెళ్లే సూపర్ లగ్జరీ, ఇంద్ర బస్సులు పాత బస్టాండ్ నుంచి తిప్పాలని నిర్ణయించామని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని నగర వన్‌టౌన్ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.